క్లుప్తంగా

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు: మండలంలో నాలుగు సోలార్ పవర్ ప్లాంట్లు నిర్మాణానికై అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. దీనిలో భాగంగా అధికారులు మండలంలోని నూకలంపాడు, లచ్చగూడెం ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలను మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో టీఎస్ రెడ్కో మేనేజర్ అజయ్, ఎంపీడీఓ ఎస్ రమేష్, విద్యుత్ ఏఈ ఉమాకాంత్, ఏపీఎం వెంకట్రావు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

మధిర: మధిర పట్టణంలోని శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద ఈనెల 30న మధ్యాహ్నం 3 గంటలకు శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష సమావేశం జరుగుతుందని తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసే జాయింట్ వీల్ బహిరంగ వేలం పాటను ఈ నెల 30న నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాలవల్ల రద్దు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ వేలం పాట తదుపరి తేది నిర్ణయించి ప్రకటిస్తామని తెలిపారు.

విద్యార్థులకు బ్యాంక్ ఖాతాలు

చింతకాని: మండలంలోని చిన్నమండవ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బోనకల్ ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది మంగళవారం బ్యాంక్ ఖాతాలను ప్రారంభించారు. పాఠశాలలోని 40మంది విద్యార్థులకు ఖాతాలను ప్రారంభించి పాసుపుస్తకాలను అందజేశారు. దీంతో బ్యాంక్ సిబ్బందికి పాఠశాల హెచ్ఎం రాంబాబు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుల్లారావు, ఖాన్, బ్యాంక్ సిబ్బంది ఉమా పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ఎర్రుపాలెం: సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్ మోహన్‌రెడ్డి, బాబురావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పీఆర్‌టీయూ సంఘ నాయకులతో కలిసి తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఉషాశారదకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జంగా గురునాథరెడ్డి, ఎస్ సంగిరెడ్డి, రాఘవ, నాగరాజు, వెంకటనారాయణ, ఫిలిప్, చిన్నప్ప, దత్తాత్రేయ, అప్పిరెడ్డి, శ్రావణి, నిహా, సుమన, రమేష్ తదితరులున్నారు.

దాడులను ఖండించండి

కొణిజర్ల: రజకుడు ముసలయ్యపై అగ్రవర్ణాలు దాడి చేయడం సరికాదని రజక సంఘం జిల్లా కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కొణిజర్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రెవెన్యూ పరిధిలోని శ్రీనివాసకాలనీ గ్రామంలో తన వ్యవసాయ భూమిలో పంటకు నీరు పెట్టుకుంటున్న ముసలయ్యపై దాడి చేసిన అగ్రవర్ణాల వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, ఇలానే ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అచ్చంపేట కార్యదర్శిపై దాడి సరికాదు

కల్లూరు: అచ్చంపేట మార్కెట్ కార్యదర్శి, చైర్మన్ లపై దాడి చేయడంతో పాటు కార్యాలయాన్ని ధ్వంసం చేయడం సరికాదని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొన్న పరిగి, నేడు అచ్చంపేట మార్కెట్ కార్యాలయాల్లో దాడులు జరిగాయని, కొందరు కావాలనే రైతుల ముసుగులో దాడులు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముక్రమ్, వెంకటేశం, సంతోష్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, వెంకటరెడ్డి, మురళీ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

కొణిజర్ల: ఫిబ్రవరి 4, 5 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జయప్రదం చేయాలని ఆ సంఘం ఖమ్మం జిల్లా నాయకుడు శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం కొణిజర్లలో కౌన్సిల్‌కు సంబంధించిన పోస్టర్లను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యారంగం బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

సన్మానం

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన ఉమ్మనేని కృష్ణకు టెలికమ్ అడ్వయిజరీ కమిటీ బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కృష్ణను మంగళవారం ముష్టికుంట్ల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, మురళి, షాజాహాన్, జానీ మియా, వెంకటేశ్వర్లు, ముస్తాఫా, నరసింహారావు, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మొదలైన పదవుల పందేరం

ఎర్రుపాలెం మండలానికి చైర్మన్ పదవి



నరసింహారావు, చైర్మన్

ఎర్రుపాలెం: మధిర మార్కెట్ చైర్మన్ పదవి ఎర్రుపాలెం మండలానికి దక్కింది. చైర్మన్‌గా మండలంలోని రాజులదేవరపాడుకు చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అనుచరుడు, పార్టీ విధేయుడైన బండారు నర్సింహారావు నియమితులయ్యారు. అలాగే, మండలంలోని మీనవోలుకు చెందిన మాజీ సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ(ఓసీ), బనిగండ్లపాడు, ఎర్రుపాలెంకు చెందిన యన్నం పిచ్చిరెడ్డి(ఓసీ), గుడేటి బాబురావు(ఎస్సీ)కు డైరెక్టర్ పదవులు దక్కాయి. దీంతో బీసీ, రెడ్డి, ఎస్సీ సామాజికవర్గాలకు కమిటీలో చోటు లభించినట్లయింది.



మధిర మార్కెట్ కమిటీ కార్యాలయం

- మధిర మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకం
- ఆత్మ కమిటీ చైర్మన్‌గా కర్నాటి కోటి
- త్వరలోనే ఇంకొన్ని పాలకవర్గాలు కూడా..

'ఆత్మ' చైర్మన్‌గా రామకోటేశ్వరావు



రామకోటేశ్వరావు

బోనకల్: మండలంలోని రాయన్నపేటకు చెందిన కర్నాటి రామకోటేశ్వరావు మధిర నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. డిప్యూటీ సీఎం ప్రతిపాదనలతో ఆయనను చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ బోనకల్ మండల అధ్యక్షుడిగా పనిచేసిన కోటేశ్వరరావు ప్రస్తుతం కలకోట సొసైటీ చైర్మన్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా తన నియామకంపై ఆయన డిప్యూటీ సీఎం భట్టికి కృతజ్ఞతలు తెలిపారు.

మధిర: మధిర నియోజకవర్గంలో పదవుల పందేరం మొదలైంది. తెలంగాణ ఏర్పడ్డాక కాంగ్రెస్ మొదటిసారి అధికారంలోకి రావడం, మధిర నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మల్లు భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి దక్కడంతో నామినేటెడ్ పదవులపై ఆశ పెట్టుకుని నాయకులు ఎదురుచూస్తున్నారు. ఇందులో భాగంగా సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూనే పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఇచ్చేలా నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తున్నారు. ఈనేపథ్యాన తొలుత మధిర మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్నినియమిస్తూ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మూడు మండలాల పరిధిలో ఉన్న మార్కెట్ చైర్మన్ పదవి బీసీలకు రిజర్వ్ కావడంతో ఎర్రుపాలెం మండలం మామునూరుకు చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండారు నరసింహారావు చైర్మన్‌గా, వంగవీడుకు చెందిన అయిలూరి సత్యనారాయణరెడ్డి వైస్ చైర్మన్‌గా పాలకవర్గం ఖరారైంది. అలాగే, డైరెక్టర్లుగా మధిర మండలం నుంచి తూములూరి నాగేశ్వరరావు(రాజా), అద్దంకి రవికుమార్, వేల్పుల చెంచయ్య, షేక్ షన్ను, బాణావత్ వెంకటరమణ, బోనకల్ మండలం నుంచి అనుమోలు వెంకటేష్, బొంతు నారాయణ గౌడ్, వంగాల రామారావు, వట్టికొండ రామకృష్ణ, ఎర్రుపాలెం మండలం నుంచి యన్నం పిచ్చిరెడ్డి, గుడేటి బాబురావు, వేమిరెడ్డి అనురాధకు స్థానం దక్కింది. కాగా, మధిర మార్కెట్ చైర్మన్‌గా నరసింహారావును నియమించనున్నట్లు 'సాక్షి'లో ముందుగానే కథనం ప్రచురితమైన విషయం విదితమే.



సత్యనారాయణరెడ్డి, వైస్‌చైర్మన్

ఆలయాలకు త్వరలోనే కమిటీలు

మధిర నియోజకవర్గంలో ఇంకా మరికొన్ని నామినేటెడ్ పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే మధిర మృత్యుంజయ స్వామి ఆలయ కమిటీ నియామకానికి కసరత్తు జరుగుతోందని సమాచారం. ఇప్పటివరకు ఆలయ చైర్మన్‌గా పనిచేయని, మొదటినుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న కుటుంబానికి చెందిన నాయకుడికి చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉంది. త్వరలోనే మహాశివరాత్రి రానున్న నేపథ్యాన ఆలయానికి కమిటీని నియమించి ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అలాగే, మధిరలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ కమిటీలనూ సైతం నియమిస్తారని తెలిసింది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పోస్టుల కోసం మండల స్థాయి నాయకులు ఎదురు చూస్తుండగా, పార్టీనే నమ్ముకున్న వారికి స్థానం కల్పిస్తుండడంపై హర్షం వ్యక్తమవుతోంది.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ గోపి, మట్టా దయానంద్

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి, ఆషా స్వచ్ఛంద సేవా నిర్వాహకుడు మట్టా దయానంద్ అన్నారు. జేవీఆర్ డిగ్రీ కళాశాలలో సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల మంగళవారం నాలెడ్జ్ ఎక్స్‌ప్రో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. క్రీడలు, సంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం



కల్లూరు: సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

సత్తుపల్లి/కల్లూరు: పీఆర్‌టీయూ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పింగిళి శ్రీపాల్ రెడ్డిని గెలిపిస్తే విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి, సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి పేర్కొన్నారు. కల్లూరులో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వరంగల్ - ఖమ్మం - నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాకాల రమేష్, షేక్ చాంద్ సాహెబ్‌తో పాటు ఎండీ.మౌలాని, పఠాన్ రహీమ్, శ్రీనివాసరావు, పోట్రు మధుసూదన్, ఎంవీకే.జ్యోతి, చిత్తులూరి సోమేశ్వరరావు, ముత్తమాల సురేష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత సత్తుపల్లికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు చిత్తలూరి ప్రసాద్ తల్లిదండ్రులు వీరమ్మ - రాజ దంపతులు ఇటీవల మరణించగా మోహన్‌రెడ్డి వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ రియాజుద్దీన్, అబ్రహం, రామకృష్ణ, మధుసూదన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న కమల్‌రాజ్

బోనకల్: అబద్ధపు వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందని మాజీ జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్ రాజ్ విమర్శించారు. మండలంలోని రావినూతల గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని చెప్పి.. కేవలం ఐదు చిన్న గ్రామ పంచాయతీల్లో సంక్షేమ పథకాలు అందించడానికి ఎంపిక చేయడం సరికాదన్నారు. కొణిజర్లలో నిర్వహించిన గ్రామసభలో బీఆర్ఎస్ ఒక్కరేషన్ కార్డుకూడా ఇవ్వలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మధిర నియోజకవర్గంలో 2021 ఆయన చేతుల మీదుగా రేషన్ కార్డుల అందించిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలు ప్రశ్నిస్తే ప్రతిపక్షాలపై నిందలు మోపడం తగదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బందం శ్రీను, మండల అధ్యక్షుడు మల్లిఖార్జున్‌రావు, కార్యదర్శి నాగేశ్వరావు, మాజీ సర్పంచ్ ఉపేందర్‌రావు, ప్రసాద్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

కొణిజర్ల: ఒకేసారి రైతులందరికీ పెట్టుబడి సాయం అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె నారాయణరావు అన్నారు. ఏక కాలంలో 3,816 ఎకరాలకు గాను రూ. 2,29,33,195 పెట్టుబడి సాయంగా అందించినందుకు గాను పెద్దగోపతి రెవెన్యూ పరిధిలోని రైతులు మంగళవారం మండలంలోని చిన్నగోపతి గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ముత్తయ్య, మహేష్, భద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

కిక్కిరిసినా ఎక్కాల్సిందే..



ముదిగొండ సెంటర్‌లో నిండిన బస్సులో ఎక్కుతున్న ప్రయాణికులు, విద్యార్థులు

ముదిగొండ: మండలంలోని పలుగ్రామాలకు పల్లె వెలుగు సర్వీసులు తక్కువ సంఖ్యలో నడిపడంతో ఉదయం సాయంత్రం సమయాల్లో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. దీంతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గ్రామసభల్లో ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పల్లెవెలుగు బస్సుల సంఖ్యను పెంచాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కల్లూరురూరల్: మండలంలోని లింగాల గ్రామంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ రూ.28వేల చెక్కును బాధితురాలు హనుమంతు ఝాన్సీకి అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వరరావు, సత్యం బాబు, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ..

ముదిగొండ: ముదిగొండలోని తహసీల్‌లో బుధవారం 10 గంటలకు మండలంలోని 87మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చెక్కులను ఆర్డీఓ గరిడి నరసింహారావు చేతుల మీదుగా అందించడం జరుగుతుందన్నారు.

ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

పెనుబల్లి: మండలంలోని లంకాసాగర్ శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రథసప్తమి పర్వదినం సందర్భంగా ఫిబ్రవరి 4న నిర్వహించనున్న స్వామి వారి కల్యాణ మహోత్సవానికి ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ పత్రికలను వేదపండితులు ఊటుకూరు భార్గవ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ బాదావత్ రాజేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మందడపు అశోక్‌కుమార్, నాయకులు తాళ్ళూరు శేఖర్‌రావు, గుంట్రు ప్రసాద్, ఎస్వీ గురునాథరావు, రామకృష్ణ, కె తారా, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

కొణిజర్ల: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని రామనరసయ్యనగర్‌లో పఠాన్ సలీమ్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం తక్షణమే స్వామినాథన్ కమీషన్ ఉత్తర్వులు అమలు చేయాలన్నారు. అనంతరం రామనర్సయ్యనగర్ రైతు సంఘం అధ్యక్షుడిగా పఠాన్ సలీమ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ శ్రీనుతో పాటు మరో 11మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు దొబ్బల కృష్ణయ్య, కొండా రామకృష్ణ, కంపసాటి వెంకన్న, గుగులోత్ శ్రీను, మంగీలాల్, ముత్తయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురద చల్లొద్దు..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్‌ను ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకుంటే దానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లటం సమంజసం కాదని సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్నారావు అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కాంగ్రెస్ నాయకులు అప్పారావు, నర్సింహారావు, నాగుల్‌మీర, రాంబాబు, గఫర్‌ఖాన్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత



పెనుబల్లి: ప్రదర్శనలతో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

సత్తుపల్లిరూరల్: ఆరోగ్య జాగ్రత్తలపై గంగారం పీహెచ్‌సీ పరిధిలోని రామగోవిందాపురం, కిష్టాపురం గ్రామాల్లో నిర్వహించిన కళాజాత ప్రదర్శనలు అందరిని ఆకట్టుకుంది. మంగళవారం పోలూరి రాము కళాజాత బృందం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, టీకాలపై కళాజాత నిర్వహించగా.. డాక్టర్ అవినాష్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈ వేణుగోపాల్, హెచ్ఈఓ వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లంకాసాగర్ పీహెచ్‌సీ పరిధిలో..

పెనుబల్లి: మండలంలోని లంకాసాగర్ పీహెచ్‌సీ పరిధిలోని టేకులపల్లి, ఏరుగట్ల, భవన్నపాలెం గ్రామాలలో సతీష్, పుల్లారావు కళా బృందంచే జానపద ప్రదర్శనలతో మాత శిశు ఆరోగ్యం, 102 వాహనాల ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా డెమో సాంబశివరెడ్డి, హెచ్ఈఓ శ్రీనివాస్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, ఏఎన్ఎంలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: సీఎం రేవంత్‌రెడ్డిని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ వైరా నియోజకవర్గ నాయకులతో కలిసి మంగళవారం హైదరాబాద్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. వైరా నియోజకవర్గానికి కావాల్సిన మౌళిక వసతులు, సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించాలని కోరడంతో.. సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సూరంపల్లి రామారావు, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, పగడాల మంజుల, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను ఆదుకుంటా..

కారేపల్లి: పార్టీకి వెన్నుముకలాంటి కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ముందుండి ఆదుకుంటానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. కారేపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు షేక్ షఫీ.. ఇటీవల గుండెపోటుతో హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. దీంతో మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే షఫీని పరామర్శించి ఆర్థికసాయం అందించాడు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు టోనీవీరప్రతాప్, మాజీ మండల కోఆప్షన్‌మెంబర్ హనీఫ్, నాయకులు తదితరులు ఉన్నారు.

ముగిసిన మండలస్థాయి క్రికెట్ పోటీలు

కారేపల్లి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించిన కామ్రేడ్ యూత్ ఆధ్వర్యంలో.. కారేపల్లి బీసీ కాలనీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కారేపల్లి, కామేపల్లి, గార్ల మండలాల స్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కారేపల్లి–సీతంపేట జట్లు తలపడగా.. కారేపల్లి జట్టు విజేతగా, రన్నరప్‌గా సీతంపేట జట్టు నిలిచాయి. దీంతో ఎస్సై రాజారాం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతిరావు, నాగేశ్వరరావు, శ్రీను, గ్రామ పెద్దలు, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

తల్లాడ: జీహో 317 స్పౌజ్‌ల కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించాలని టీపీటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని తల్లాడ, పినపాక, అన్నారుగూడెం, బిల్లుపాడు, నూతనకల్, కుర్నవల్లి, మిట్టపల్లి పాఠశాలలను ఆయన సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు ఇమ్మానియేల్ రాజు, ఫ్రాన్సిస్, ఉషారాణి, రమాదేవి, డి.శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

వేంసూరు: సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర నాయకులు కలపాల ఏసు డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో లక్ష డప్పులు వెయ్యి గొంతుల కళాజాతా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసు మాట్లాడుతూ ఫిబ్రవరి 7న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని మాదిగలంతా జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ పమ్మి రవి, నగిరి కంటి వెంకట్, రాజా రమేష్, మండల అధ్యక్షులు నరేష్, ఏసుకోటమర్తి బాలస్వామి, సాంబయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కొణిజర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. మంగళవారం మండలంలోని రామనర్సయ్యనగర్‌లో యాసా శ్రీను వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని కాంగ్రెస్ హయాంలోనైనా తమ సమస్యలు పరిష్కారం అవుతాయోనని ప్రజలకు ఎదురుచూస్తున్నారని తెలిపారు. అంతకు ముందు నాయకులు యాసా శ్రీను సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కళావతి, లతాదేవి, నిర్మల, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

ఎలక్ట్రీషియన్‌కు ఆర్థిక సాయం

మధిర: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన ఎలక్ట్రీషియన్ అఖిల్‌కు మధిర ఎలక్ట్రీషియన్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం చేశారు. సహచర ఎలక్ట్రీషియన్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని యూనియన్ తరఫున రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, పట్టాబి, ఆశీర్వాదం, కరుణ్, కిషోర్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి రూ.40 వేలు..



అంబికకు రూ.40 వేలు అందిస్తున్న మాస్ స్వచ్ఛంద సభ్యులు

తల్లాడ: మండలంలోని తెలగవరం గ్రామంలో విద్యార్థిని వారాల అంబికకు మాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంగళవారం రూ.40 వేలు అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన అంబిక బీటెక్ చదువుతుంది. ఆమె ఫీజు కూడా చెల్లించలేని స్థితిలో వారి కుటుంబం ఉండటంతో గమనించిన ఎంపీడీఓ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తేల్లూరి శ్రీనివాసరావు రూ.10 వేలు, మాస్ నిధి నుంచి రూ.30వేలు కలిపి అంబిక హాస్టల్ ఫీజుకై రూ.40 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం త్రీటౌన్ ఎఎస్ఐ మడుపల్లి బాబురావు, మంగలపూడి వెంకటేశ్వర్లు, ఐటీటీ నరసయ్య, మోహన్‌రావు, శ్రీనివాసరావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి..



ఆలయ నిర్వాహకులకు రూ.58,116 అందజేస్తున్న దాతలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో నిర్మించనున్న శ్రీప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయ నిర్మాణానికి సత్తుపల్లికి చెందిన ఆకర్షణ జ్యూవెలరీస్ నిర్వాహకులు కణిగొళ్ల గోపాలకృష్ణ, లక్ష్మీతయారు, వినయ్, వరలక్ష్మి దంపతులు రూ.58,116లు మంగళవారం వితరణగా అందించారు. అదే విధంగా వనమా వాసు రూ.10వేలు అందించారు. కార్యక్రమాలలో ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానానికి..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. శాశ్వత అన్నదానికి నాగళ్ల సత్యనారాయణ కుమారులు కలిసి రూ.50,116లు అందించారు. ఈ సందర్భంగా సుమారు 2వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లగుండ్ల కృష్ణయ్య, నాగళ్ల ప్రసాద్, నరుకుళ్ల రవి, నాగళ్ల రామారావు, బొంతు కృష్ణారావు, ఎర్రోజు పురుషోత్తం, డి.వెంకట్రావ్, రవికుమార్, కొప్పుల రజిని, వల్లభనేని పవన్, నాగళ్ల రాజ్యం, ప్రత్యుష, పుల్లారావు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీకి రూ.6లక్షల విరాళం



విరాళం అందజేసిన బోనం ప్రేమ్‌కుమార్, అనిత దంపతులు, కుమారుడు కీర్తన్

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో మల్లిఖార్జున స్వామి దేవాలయ ప్రహరీ నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఆస్పిరియాలిటీ అవతార్ సంస్థ అధినేత బోనం ప్రేమ్ కుమార్, అనిత దంపతులు రూ.6లక్షలు విరాళం అందించారు. గతేడాది మార్చి నెలలో మల్లిఖార్జున స్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకల్లో వారు పాల్గొని ప్రహరీ నిర్మిస్తామని దేవాలయ కమిటీకి హామీ ఇచ్చారు. ఈ మేరకు వారి కుమారుడు కీర్తన్ కావాల్సిన మెటీరియల్, ఇతర ఖర్చులు అందించగా.. చైర్మన్ చిత్తలూరి నరసింహారావు ఆధ్వర్యంలో ప్రహరీ పనులు పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.